కొండకల్ శంకర్‌గౌడ్‌కు నివాళి



రాయదుర్గం: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కొండకల్ శంకర్‌గౌడ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం రాయదుర్గంలో ఆయన చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ సాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. టీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జిగా పార్టీ బలోపేతం చేయడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, వార్డు, ఏరియా కమిటీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న జ్ఞానేశ్వర్ సతీమణి చంద్రకళ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, నాయకులు

రాయదుర్గం: పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉదయం రాయదుర్గంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి కాసాని చంద్రకళ ఓటర్లకు పార్టీ కరపత్రాలను అందిస్తూ బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేవెళ్లలో గెలుపు ఖాయమన్నారు.

ఆల్విన్ కాలనీ ఫేజ్ 1లో..

ఆల్విన్‌కాలనీ: బీఆర్‌యస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేయాలంటూ ఆల్విన్ కాలనీ ఫేజ్ 1, విజయ్‌నగర్‌కాలనీ, నవోదయ కాలనీలో కాలనీపెద్దలు అంజిరెడ్డి, రాజిరెడ్డి, స్వరూప, లావణ్య తదితరులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ అధ్యక్షుడు జిల్లా గణేష్ మాట్లాడుతూ బీఆర్‌యస్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నదన్నారు. గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కట్ట శ్రీను, రవి, రాములు గౌడ్, వెంకటేష్‌గౌడ్, జగదీష్, సత్యనారాయణ తతదిరతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



పీజేఆర్‌నగర్ కాలనీలో పర్యటిస్తున్న వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ కాలనీ ఫేజ్ 2, వాంబే బ్లాక్ నంబర్ 50 నుంచి 53 వరకు వేసిన సీసీ రోడ్లను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేసి, క్యూరింగ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యువనేత రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, సయ్యద్, యాదగిరి, కె. శ్రీనివాస్, బాలస్వామి, బాబునాయక్, జనార్దన్, ఫారూఖ్, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంతి



పూజలో పాల్గొన్న పండితులు, వేద విద్యార్థులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీ జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలు శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 12వ తేదీ వరకు 4 రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు వేద పండితుడు జ్యోతిశ్చంద్ర శర్మ తెలిపారు. ఈ సందర్భంగా అధర్వణ వేద స్వాహాకార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ లావణ్య, శ్రీ విజయ శంకర దేశిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

శిలాఫలకాలకే పరిమితం..

అభివృద్ధి పనులు ఏళ్లు గడుస్తున్నా శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. మూడు పనులకు శ్రీకారం చుట్టగా అందులో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి మిగతా బస్తీవాసుల నుంచి వ్యతిరేకత రావడం తదనంతరం రాష్ట్రం విడిపోవడంతో అది కాస్తా మరుగునపడిపోయింది. ఇక మిగతా రెండింటిలో మాత్రం ఒకదానికి నిధులు మంజూరు అయి సగం పనులు జరిగాయి. ఇవి కాస్తా శిథిలదశకు చేరుతున్నాయి. ఇక మూడవ పనికి నిధులు మంజూరై, శిలాఫలకం వేసి... పనులు ప్రారంభించలేదు. – రాయదుర్గం



2012లో కేశవనగర్‌లో రాజీవ్ ఆవాస్ యోజన గృహ నిర్మాణాల శిలాఫలకం (ఫైల్)

12 ఏళ్ల క్రితం సీఎం వేసిన శిలాఫలకం..

- దేశంలోనే మొదటిసారిగా రాజీవ్ ఆవాస్ యోజన గృహ నిర్మాణ పథకానికి 2012 సంవత్సరంలో రాష్ట్రంలో గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవనగర్ బస్తీలో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.
- అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా రాజీవ్ ఆవాస్ యోజన గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- కాలనీవాసులను ఖాళీ చేయించి వారికి తాత్కాలికంగా నివాసముండేందుకు కాలనీలోనే 'ట్రాన్సిట్ గృహాలు' నిర్మించారు. కానీ ఈ గృహ నిర్మాణ పథకాన్ని బస్తీవాసులు వ్యతిరేకించడంతో దీన్ని నిలిపివేశారు.
- తర్వాత మాదాపూర్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో గుడిసెవాసులకు తాత్కాలిక గృహాలలో ఉండేలా ఏర్పాట్లు చేశారు.
- ఇక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి రెండు ఎకరాల స్థలాన్ని కూడా ఈ బస్తీలోనే పరిశీలించడం జరిగింది. కానీ దీన్ని కూడా స్థానికులు వ్యతిరేకించడంతో నిలిచిపోయింది. తామున్న చోటే ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని వారు కోరుతున్నారు.

రాయదుర్గం శ్మశానవాటిక..

- రాయదుర్గంలోని ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధి కోసం 2013లో రూ.26.35 లక్షలతో అప్పటి ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ శంకుస్థాపన చేశారు.
- కానీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రగతి లేదు. ప్రహరీగోడలు, బర్నింగ్ ప్లాంట్‌లు, దుస్తులు మార్చుకోవడానికి గదులు, సేద తీరేందుకు బెంచీలు, నీటి సౌకర్యం కోసం బోరు, కుళాయి, లైటింగ్ సదుపాయం, గ్రీనరీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- లింకురోడ్డు నిర్మాణం కోసం స్థల పరిశీలనకు 5 ఏళ్ల క్రితం వచ్చిన అప్పటి మేయర్ బొంతు రామ్మోహన్ రూ.65 లక్షలతో శ్మశానవాటికను అభివృద్ధి చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. అది అలాగే మిగిలిపోయింది.
- లింకురోడ్డు నిర్మాణం కోసం అవసరమైన చోట ప్రహరీ నిర్మించి మిగతా చోట్ల వదిలేశారు .



2008లో గౌలిదొడ్డిలో బ్లడ్‌బ్యాంక్ భవన నిర్మాణానికి అప్పటి హోం మంత్రి వేసిన శిలాఫలకం ఇది. కానీ ప్రస్తుతం కనిపించడం లేదు (ఫైల్)

మినీ మహాప్రస్థానం.. 9 ఏళ్లు గడిచినా పూర్తికాలేదు

- 2015లో గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి తండా –గోపన్‌పల్లి మధ్యన ఉన్న శ్మశానవాటికను మినీ మహాప్రస్థానం తరహాలో తయారు చేయాలని అప్పట్లో నిర్ణయించారు.
- బర్నింగ్‌ప్లాంట్లు, గదులు, ప్రహరీ నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం అవి శిథిలమవుతున్నాయి. శ్మశానవాటిక లోపల కంపచెట్లు మొలిచి చెత్తాచెదారం పేరుకుపోయింది.

బ్లడ్‌బ్యాంక్‌కు శంకుస్థాపన

- గౌలిదొడ్డిలో బ్లడ్ బ్యాంకు భవన నిర్మాణానికి 2008లో శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదు.
- ఐటీ కారిడార్, ఔటర్ రింగురోడ్డు నిర్మాణంతో దీన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించారు.ముఖ్యంగా శేరిలింగంపల్లి ప్రాంతంలో చోటుచేసుకునే రోడ్డు ప్రమాదాలు, ఇతర రోగులకు అవసరమైన రక్తం కావాలంటే నగరానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.
- దీంతో అప్పటి హోంమంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చొరవతో జిల్లా కలెక్టర్ కొంత చొరవ చూపినా ఎలాంటి అభివృద్ధి లేదు.
- బ్లడ్‌బ్యాంకు అవసరాన్ని గుర్తించి అద్దె భవనంలోనైనా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ప్రజాప్రతినిధులు గుర్తించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

నేర్చుకోవడం నిరంతరాయంగా సాగాలి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి



శంషాబాద్: నేర్చుకోవడమనేది నిరంతరాయంగా సాగాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి విజయ్‌సేన్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాముఖ్యతను ఇచ్చిన దేశాలే ఎక్కువగా అభివృద్ధి చెందాయన్నారు. ప్రస్తుతం దేశంలో విద్యారంగం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళ్తుందన్నారు. కాగా పట్టణంలో ఏర్పాటు చేసిన అకాంప్లిష్ అకాడమీని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో దిశానిర్దేశం చేశారు. బలవంతపు చదువులు కాకుండా భవిష్యత్తును నిర్దేశించుకునే స్థాయిలో చదువు కొనసాగించాలన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, విద్యావేత్త కొండల్‌రెడ్డి, కార్డియాలజిస్ట్ హన్మంతరెడ్డి, సంస్థ చైర్మన్ బుచ్చిరెడ్డి తదితరులున్నారు.

పాస్టర్ల ఆత్మీయ సమావేశం

మియాపూర్ : కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని కోడికూర చిట్టిగారే హోటల్‌లోని బాంక్వెట్ హాల్‌లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో కార్పొరేటర్లు నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, హఫీజ్‌పేట డివిజన్ అధ్యక్షులు బాలింగ్ గౌతమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కి పూర్తిస్థాయి మద్దతు తెలియచేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పాస్టర్లు పాల్గొన్నారు.

ఇద్దరికి జరిమానా

మరొకరికి జరిమాన, జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు ఇద్దరికి జరిమానా, మరొకరికి జరిమానాతో పాటు రెండు రోజులు జైలుశిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా,జడ్జి ఇద్దరికి రూ. 2 వేల చొప్పున జరిమాన, మరో వ్యక్తికి రూ. 2 వేలు జరిమానాతో పాటు రెండురోజులు జైలు విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

148 మద్యం బాటిళ్లు స్వాధీనం

శంషాబాద్ రూరల్: అక్రమంగా 148 బాటిళ్ల మద్యం కల్గి ఉన్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాచారం–జూకల్ రోడ్డుపై గురువారం జూకల్‌వాసి కోడూరు శ్రీకాంత్ అక్రమంగా మద్యం సీసాలతో ఉండగా విశ్వసనీయ సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని తనిఖీ చేయగా 96 విస్కీ బాటిళ్లు పట్టుబడ్డాయి. అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

మరో ఘటనలో..

మండలంలోని అలీకోల్‌తండాకు చెందిన కేతావత్ మను ఇంట్లో అక్రమంగా పెద్ద ఎత్తున మద్యం సీసాలను నిల్వ చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఇంట్లో తనిఖీ చేయగా 52 విస్కీ బాటిళ్లు లభించాయి. వీటిని స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు ఓటేయ్యండి



ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ ఫేజ్ 2 కాలనీవాసులు ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆల్విన్‌కాలనీ డివిజన్ తరపున అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటి ప్రచారంలో పాల్గొని కరపత్రాలు అందజేసి కాంగ్రెస్ పార్టీకి ఓటేయ్యాలని కోరారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, సయ్యద్, యాదగిరి, రాజు, కె. శ్రీనివాస్, బాలస్వామి, బాబునాయక్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

జీఐఎల్‌టీలో కోర్సు చేస్తే 100 శాతం జాబ్ గ్యారెంటీ

'పాలిసెట్‌లో అర్హతే జీఐఎల్‌టీలో సీటు'

- పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష మే 24న
- ప్రవేశ పరీక్ష రాసే వారికి ఉచిత శిక్షణ
- 'జీఐఎల్‌టీ' రాయదుర్గం ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్‌హుస్సేన్ వెల్లడి



Interview

రాయదుర్గం: జీఐఎల్‌టీలో కోర్సు చేస్తే 100 శాతం జాబ్ గ్యారెంటీ.. పాలిసెట్‌లో అర్హత సాధిస్తే రాయదుర్గంలోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)'లో సీటు వస్తుందని రాయదుర్గం జీఐఎల్‌టీ ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ తెలిపారు. ఈ కోర్సులను పూర్తి చేస్తే ప్రభుత్వ, ప్రైవేటు లెదర్ టెక్నాలజీ కంపెనీలలో ఉద్యోగం లేదా స్వయం ఉపాధి పొందుతూ నలుగురికి ఉపాధి అవకాశాలు కల్పించే ఆస్కారం ఉంటుంది. ఇక్కడ కోర్సులు పూర్తి చేసిన వారికి మంచి అవకాశాలు ఉంటాయని ఆయన సాక్షికి వివరించారు.

ప్రశ్న: పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారు ?

జ: తెలంగాణ రాష్ట్రంలో పాలిసెట్ ప్రవేశ పరీక్షను మే 24వ తేదీన నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్ర: పాలిసెట్‌లో అర్హత సాధిస్తే జీఐఎల్‌టీలో సీట్లు పొందవచ్చా..

జ: జీఐఎల్‌టీలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో కూడా సీటు పొందాలంటే పాలిసెట్‌లో అర్హత తప్పనిసరి. పాలిసెట్‌లో అర్హత సాధించిన వారికి మాత్రమే జీఐఎల్‌టీలో సీటు పొందడానికి అవకాశం ఉంటుంది.

ప్ర: జీఐఎల్‌టీలో నిర్వహించే కోర్సులు.. కాల పరిమితి ?

జ: జీఐఎల్‌టీ రెండు కోర్సులను నిర్వహిస్తాం. మూడేళ్ళ కాల పరిమితితో కూడిన కోర్సులను నిర్వహిస్తారు. అందులో ఒకటి డిప్లొమో ఇన్ లెదర్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, రెండవది డిప్లొమో ఇన్ లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ కోర్సులను నిర్వహిస్తాం. మూడేళ్లలో ఆరుమాసాల ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఉపకార వేతనంతో ఉంటుంది.

ప్ర: జీఐఎల్‌టీలో ఉన్న సౌకర్యాలు..హాస్టల్ వసతి గురించి వివరించండి

జ: జీఐఎల్‌టీలో తరగతి గదులతోపాటు, ఫుల్లీ ఎక్విప్డ్ ల్యాబ్స్, కంప్యూటర్ ల్యాబ్, లెదర్ టెక్నాలజీకి సంబంధించి ప్రాక్టికల్స్ నిర్వహణకు అవసరమైన అత్యాధునిక యంత్రాలు, నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన వసతి గృహం అందుబాటులోకి తీసుకొచ్చాం. విద్యార్థులు క్యాంపస్‌లోనే ఉంటూ చదువు కోవచ్చు.

ప్ర: 100 శాతం జాబ్ గ్యారెంటీ ఎలా?

జ: జీఐఎల్‌టీలో నిర్వహించే రెండు కోర్సులలో పూర్తి చేసిన వారు ఇప్పటి వరకు 100 శాతం ఉపాధి పొందారు. జాతీయ, అంతర్జాతీయ లెదర్ టెక్నాలజీ కంపెనీలలో ఉద్యోగాలు పొందగా, మరి కొందరు స్వయం ఉపాధిలో సాగుతున్నారు.

ప్ర: ఉచిత శిక్షణకు స్పందన వస్తోందా..

జ: పాలిసెట్–24కు దరఖాస్తు చేసిన వారికి ఉచితంగా ఈ ఏడాది నుంచే ప్రత్యేక శిక్షణ ప్రారంభించాం. ఈ ఏడాది 25 మంది చేరారు. అర్హులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.

మేలురకం వంగడాలతో ఉత్పత్తిని పెంచాలి

ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీ.ఆర్ శర్మ



ఉత్తమ రైతులను సన్మానిస్తున్న దృశ్యం

ఏజీవర్సిటీ: భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా అధునాతన టెక్నాలజీని వినియోగించుకుంటూ.. వాతావరణ మార్పులను తట్టుకునే వంగడాలను ఉత్పత్తి చేసి ఉత్పాదకతను పెంచాల్సిన అవసరం ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీ.ఆర్ శర్మ సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో భారత మొక్కజొన్న పరిశోధన సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 67వ మొక్కజొన్న పరిశోధన కేంద్రాల వార్షిక సదస్సులో ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా మొక్కజొన్న విషయంలో దేశం సాధించిన ప్రగతి అపూర్వమని కొనియాడారు.

- మొక్కజొన్న ముడిపదార్థంగా ఇథనాల్ సహా అనేక ఉత్పత్తులు తయారవుతున్నాయన్నారు. తగ్గుతున్న నీటి వనరులు, వాతావరణ మార్పులు, పెరుగుతున్న డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని ఉత్పాదకతను పెంపొందించేందుకు శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించాలన్నారు.
- పరిశోధన సంస్థలు ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేయాలని, టెక్నాలజీని వాడుకోవాలన్నారు.
- విలువ జోడింపు మార్కెట్ అనుసంధానాలపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన సూచించారు.

165 దేశాల్లో ప్రపంచ పంటగా గుర్తింపు

- సుమారు 165 దేశాల్లో సాగవుతున్న మొక్కజొన్న ప్రధాన ప్రపంచ పంటగా గుర్తింపు పొందిందని వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో మొక్కజొన్న ప్రధాన పంట అని, ప్రాంతాల వారీగా ఉత్పత్తుల్లో అంతరాలు ఉన్నాయని వివరించారు. నీటిఎద్దడి, చీడపీడలు, భూసార క్షీణత మార్కెట్‌కి సరైన అనుసంధానం లేకపోవడం వల్ల మొక్కజొన్న రైతులు సవాళ్లని ఎదుర్కొంటున్నారని వాటిని అధిగమించడానికి సమీకృత ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రస్తుతం బేబీకార్న్, స్వీట్‌కార్న్‌లకు ఆదరణ పెరుగుతుందని, సేంద్రియ సహా వ్యవసాయ విధానాల వల్ల ఈ రకాల మొక్కజొన్న సాగుకి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.
- మొక్కజొన్న పంట సాగులో ప్రతిభ కనపరిచిన రైతులు, ఎఫ్‌పీఓలను ఘనంగా సన్మానించారు. ఐసీఏఆర్ అసిస్టెంట్ జనరల్ ఎస్‌కె. ప్రధాన్, భారత మొక్కజొన్న పరిశోధన సంస్థ డైరెక్టర్ హెచ్.ఎస్.జాట్, నోడల్ అధికారి రమేష్‌కుమార్, విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు, వివిధ ఐసీఏఆర్ సంస్థల సంచాలకులు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

- 'మనూ'లో స్కూల్ ఆఫ్ సైన్సెస్‌లో అడ్మిషన్ల ప్రక్రియ
- జూన్ 30వ తేదీ పోర్టల్ మూసివేస్తాం .. ఆలోపు దరఖాస్తు చేసుకోవాలి
- డీన్ ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్‌ఖాన్

రాయదుర్గం: మనూలోని స్కూల్ ఆఫ్ సైన్సెస్‌లో మెరిట్ ఆధారిత రెగ్యులర్ పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులలో దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించినట్లు 'మనూ' స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పోర్టల్‌ను జూన్ 30న మూసివేయడం జరుగుతుందన్నారు. అలాగే ఎమ్మెస్సీలో మ్యాథమెటిక్స్, బోటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీకి 30 సీట్లు ఉండే ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ మినహా ప్రతి కోర్సులో 20 సీట్లు ఉంటాయన్నారు. వృత్తిపరమైన కోర్సులైన మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ, మెడికల్ లేబొరేటరీ టెక్నాలజీలలో కూడా ఒక్కో కోర్సులో 20 సీట్లు ఉంటాయన్నారు. అర్హత ప్రమాణాలు, ఇతర వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.

ఎన్‌ఈపీ–2020 కింద 4 ఏళ్ళ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు

నూతన జాతీయ విద్యావిధానం–2020 కింద నాలుగు ఏళ్ళ కాలపరిమితితో కూడా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులున్నాయని 'మనూ' గణిత శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ ఖాజా మొయినుద్దీన్ తెలిపారు. గణితంలో రెండేళ్ళ ఎంఎస్సీ కోర్సు, పీహెచ్‌డీలో అడ్మిషన్లు ఇస్తామన్నారు. మరింత సమాచారం కోసం అడ్మిషన్స్ హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్లు 9866802414, 6207728673లో సంప్రదించాలన్నారు.

'మనూ'లో ప్లేస్‌మెంట్ డ్రైవ్.. 55 మందికి ఉద్యోగాలు

నియామకపత్రాలు అందించిన వీసీ ఐనుల్ హసన్



రాయదుర్గం: మనూలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతమైంది. విజన్ ఇండియా సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా, గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్‌లు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో పదవ తరగతి, డిప్లొమో, ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన వారికి అవకాశం కల్పించారు. ఇందులో ఉర్దూ విశ్వవిద్యాలయంకు చెందిన మనూ పాలిటెక్నిక్ విద్యార్థులు ఎక్కువగా హాజరయ్యారు. ప్రతిభ చాటిన 55 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఎంపికైన వారికి వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ నియామకపత్రాలను అందించారు. కార్యక్రమంలో విజన్ ఇండియా సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్‌తోపాటు పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

యువత చూపు బీఆర్ఎస్ వైపే..



ఎమ్మెల్యే గాంధీ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువత

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: యువత చూపు బీఆర్ఎస్ వైపు ఉందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం బీఆర్ఎస్ నాయకులు గువ్వల రమేష్ ఆధ్వర్యంలో కొండాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూటకపు హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో జుబేర్, ఇర్ఫాన్, ప్రవీణ్, ఎస్‌కె శ్రవణ్, నజీర్, సాయి, బషీర్, రహీం, శివ, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టూరో యూనివర్సిటీ స్పాట్ అడ్మిషన్లు



బంజారాహిల్స్: అత్యాధునిక విద్యకు పేరొందిన టూరో యూనివర్సిటీ ఈ నెల 10న బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనుంది. అంతర్జాతీయ విద్యావకాశాలను ఇక్కడి విద్యార్థులకు అందించే గేట్ 2 యూని సహకారంతో టూరో యూనివర్సిటీ భావి విద్యార్థుల కోసం ప్రత్యేక స్పాట్ అడ్మిషన్ ఆఫర్లు, స్కాలర్‌షిప్‌లను ప్రకటించింది. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యూహాత్మక కార్యక్రమాల అసోసియేట్ ప్రొవోస్ట్ డాక్టర్ రీమ అరన్హా, ఇంటర్నేషనల్ స్టూడెంట్ రిక్రూట్‌మెంట్ అండ్ ఎన్‌రోల్‌మెంట్ డైరెక్టర్ జేమ్స్ షాపర్‌లు మాట్లాడుతూ... అధ్యక్షుడు పవన్ శ్రీవాత్సవ నేతృత్వంలోని గేట్ 2 యూని ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులకు విస్తృతమైన నియామక అనుభవం, వ్యక్తిగత మద్దతును అందిస్తున్నట్లు చెప్పారు. స్పాట్ అడ్మిషన్స్ కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు టూరో యూనివర్సిటీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకుంటే ప్రత్యేకంగా 5000 డాలర్ల స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుందన్నారు. టూరో యూనివర్సిటీలో చదువుకోవాలనుకునే విద్యార్థులు ఈ నెల 10న బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌లో జరిగే స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462